క్లుప్తంగా

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు


ఆర్‌డీఓ శేషశైలజకు ఫిర్యాదు చేస్తున్న ప్రజాప్రతినిధులు

బొబ్బిలి రూరల్‌: పట్టణంలోని అమ్మిగారి కోనేరు గట్టుపై అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, పాలవలస ఉమాశంకరరావు, ఎస్‌.బాబుతో పాటు సీహెచ్‌ రాజగోపాల్‌, దిబ్బ గోపి, వాడపల్లి మనోజ్‌, ఒమ్మి రామారావు కోరారు. ఇదే విషయమై గురువారం ఆర్‌డీఓ పి.శేషశైలజను కలిసి, వినతి పత్రం సమర్పించారు. వాల్టా చట్టం అమలు చేయాలని, ఎటువంటి అనుమతులు లేకుండా చేసిన నిర్మాణాలను కూల్చాలని అభ్యర్థించారు. అంతకుముందు తహసీల్దార్‌ ఎస్‌.రాజారావును కూడా నేతలు కలిసి, వినతి పత్రం అందజేశారు. స్పందించిన సదరు నేతలు అక్రమ కట్టడాలను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ త్రినాధరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఎన్‌.బూర్జవలస గ్రామ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల పాఠ్యాంశాల ప్రణాళికలు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు గమనించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని, జగనన్న గోరుముద్ద పథకంలో కొత్త మెనూ పాటించాలని తెలిపారు.

సచివాలయ సేవలు వినియోగించుకోవాలి


మండాకురిటి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాధాచారి

సంతకవిటి: గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎస్‌.రఘునాధాచారి కోరారు. గురువారం మండలంలోని మండాకురిటి గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించాలని, ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గృహాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి


ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న హౌసింగ్‌ ఈఈ గౌరీశంకరరావు

వంగర: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను వేగవంతం చేయాలని చీపురుపల్లి డివిజన్‌ హౌసింగ్‌ ఈఈ జి.గౌరీశంకర్‌ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన గ్రామాల వారీగా గృహాల రిజిస్ట్రేషన్‌ పూర్తి చేస్తే వాటి గ్రౌండింగ్‌కు అవసరమైన సిమెంట్‌ సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్‌ ఏఈ జి.పైడితల్లి పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే సరిహద్దులు గుర్తించాలి


సూచనలిస్తున్న తహసీల్దార్‌ రాజేశ్వరరావు

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న భూముల రీసర్వేలో రైతుల సమక్షంలోనే సరిహద్దులు గుర్తించాలని తహసీల్దార్‌ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని జె.కొత్తవలస గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్‌ ట్రూతింగ్‌ను గురువారం పరిశీలించిన ఆయన భూముల సరిహద్దుల గుర్తింపు సమయంలోనే రైతుల నుంచి వారి ఆధార్‌కార్డు, ఫోన్‌ నంబర్‌ సేకరించాలని తెలిపారు.

రబీపైనే ఆశలు!

- నియోజకవర్గంలో పెరిగిన ఆరుతడి పంటల సాగు
- 4,464 ఎకరాల్లో మొక్కజొన్న, 667 ఎకరాల్లో కూరగాయల సాగు
- ఏపుగా పెరిగిన పంటలతో రైతుల్లో ఆనందం
- రబీ సీజన్‌లో లాభాలు వస్తాయని ఆశిస్తున్న అన్నదాతలు

మండలాల వారీగా మొక్కజొన్న, కూరగాయల సాగు(ఎకరాలలో)

మండలం	మొక్కజొన్న	కూరగాయలు
రామభద్రపురం	1413	460
బొబ్బిలి	818	106
బాడంగి	188	65
తెర్లాం	2045	36


నాయుడువలసలో ఆశాజనకంగా మొక్కజొన్న సాగు


సొంపురంలో టమాటా పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి కృష్ణమోహన్‌

రామభద్రపురం: నేల.. తల్లితో సమానమన్నది అన్నదాతల అపారమైన నమ్మకం. నేలను నమ్ముకున్న వారు.. తల్లిని నమ్ముకున్న వారెవవరూ నష్టపోరన్నది వారి విశ్వాసం. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఓ సీజన్‌లో పంట నష్టపోయినా కుంగిపోకుండా మరో సీజన్‌లో పంటలు సాగు చేసి, మంచి దిగుబడి, లాభాలను అన్నదాత ఆశిస్తాడు. ఖరీఫ్‌ సీజన్‌ మొదట్లో నెలకొన్న తీవ్ర వర్షాభావం, ఆ తర్వాత వచ్చిన పలు తుపానుల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్నతో పాటు టమాటా, బెండ, పొడుగు చిక్కుడు, కాలీఫ్లవర్‌ వంటి కూరగాయ పంటలు పూర్తిగా పాడయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్‌ చివరిలో కురిసిన వర్షాలతో ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు విపరీతంగా పెరిగాయి. దీంతో రబీ సీజన్‌లో పండించే పంటలకు సాగునీరు కొదవలేదు. ఇప్పుడు ఎక్కడ చూసినా రబీ పంటలు ఏపుగా పెరగడంతో రైతులు వాటిపై గంపెడాశలు పెట్టుకున్నారు. అధిక దిగుబడి వస్తే ఖరీఫ్‌లో చూసిన నష్టాన్ని నివారించుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు.

తగ్గిన పెట్టుబడి భారం..

రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయడంతో వారికి పెట్టుబడి భారం తగ్గింది. ప్రస్తుతం చేతికందిన పంటలు కూడా బాగుండడంతో అన్నదాతలు వాటి ద్వారా లాభాలు వస్తాయని ఆశిస్తున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో 4,464 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 667 ఎకరాల్లో బెండ, టమాటా, చిక్కుడు, కాలీఫ్లవర్‌ వంటి కూరగాయల పంటలు, తోటకూర, జనపకూర, చుక్కకూర, పాలకూర వంటి ఆకుకూరలు కూడా పండిస్తున్నారు. ఖరీఫ్‌ సీజన్‌లో తుపానుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కూడా అందజేసింది. దీంతో రబీ పంటల సాగు సాఫీగా చేయగలుగుతున్నామని అన్నదాతలు అంటున్నారు.

సస్యరక్షణే సాగుకు శ్రీరామరక్ష..



సాగులో సస్యరక్షణ చర్యలే శ్రీరామరక్ష. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. రబీ సీజన్‌లో ఎండలతో వాతావరణం వేడిగా ఉంటుంది. దీంతో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలి. కూరగాయల సాగు చేసే రైతులంతా ఉద్యానశాఖాధికారుల సూచనల మేరకు మెలకువలు పాటిస్తూ పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణపై అప్రమత్తంగా ఉండాలి. కూరగాయల రైతులు ఓ బ్యాటరీ స్ప్రేయర్‌ లేదా పెట్రోల్‌ స్ప్రేయర్‌ కొనుగోలు చేస్తే ఆ బిల్లుతో పాటు విత్తన బిల్లు పరిధిలోని ఆర్‌బీకేల్లో దరఖాస్తు అందజేయాలి. ఇలా చేస్తే ప్రభుత్వం హెక్టార్‌కు రూ.20 వేలు సబ్సిడీ ఇస్తుంది.

–కృష్ణమోహన్‌, ఉద్యానశాఖాధికారి, రామభద్రపురం.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం


రాజాం: వేంకటేశ్వరనగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

వైఎస్సార్‌ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పలువురు పార్టీ నేతలు గురువారం విస్తృత ప్రచారం చేపట్టారు. పట్టభద్రులైన వారి ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కొంతమంది అభ్యర్థించగా, మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి, వినతించారు. ఆయన గెలుపు ద్వారా విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను వినిపించాలని కోరారు. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పట్టభద్రులంతా పాల్గొని, ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్‌


రామభద్రపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు


రేగిడిలో ప్రచారంలో భాగంగా వాల్‌పోస్టర్లతో పార్టీ మండల నాయకులు


తెర్లాం: కాగాంలో ఇంటింటికీ వెళ్లి, ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ ఉర్మిళ


వంగర: ప్రచారంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ తదితరులు


బొబ్బిలి రూరల్‌: బొడ్డవలసలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ శాంతికుమారి


బాడంగి: కోడూరులో ప్రచారం చేస్తున్న మండల జేసీఎస్‌ కన్వీనర్‌ మధుసూదనరావు

విద్యార్థులకు అభినందనలు


రాజాం సిటీ: విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు


వంగర: ట్రోఫీని ముద్దాడుతున్న కార్తీక్‌

వంగర: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని సంగాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి బొడ్రోతు కార్తీక్‌ను ప్రధానోపాధ్యాయుడు రౌతు శ్రీనివాసరావు, సిబ్బంది గురువారం అభినందించారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు తరపున కార్తీక్‌ ఆడి, జట్టును ప్రథమ స్థానంలో నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మేరకు అతడిని మెచ్చుకున్నారు.

రాజాం సిటీ: స్థానిక డోలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శెట్టి విష్ణువర్ధన్‌ను గురువారం పాఠశాల ఆవరణలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జె.వెంకటరమణ, ఉపాధ్యాయులు రుంకు శ్రీనివాసరావు, గోవిందరావు, మురళీకృష్ణ, సునీత, లీలావతి, భరత్‌కుమార్‌, మధులత, శాంతి కుమారి, గణేష్‌, సులోచన అభినందించారు. చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం తరపున ఆడి, జట్టును ప్రథమ స్థానంలో నిలబెట్టాడని పీడీ రేణుక తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రస్తుతం నీరు సరఫరా చేయడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో వీవీఆర్‌పేట, జేకేగుమ్మడ, రాజులగుమ్మడ, రుషింగి, తలగాం, బంగారువలస, కొప్పరవలస, మద్దివలస, కొట్టిశ, లక్ష్మీపేట గ్రామాల్లోని సాగునీటి చెరువుల్లో నీటిని నిల్వ చేసుకోవాలని తెలిపారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో మూలకు చేరిన బోర్లను బాగుచేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చాలా గ్రామాల్లో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయిల ద్వారా తాగునీరు అందేలా చూస్తున్నామన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి


పోలింగ్‌ కేంద్రం పరిశీలనలో ఎమ్మెల్సీ ఎన్నికల జోనల్‌ అధికారి చంద్రావతి

తెర్లాం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల జోనల్‌ అధికారి, ఏపీ రెసిడెన్షియల్‌ స్కూల్స్‌ జిల్లా కో–ఆర్డినేటర్‌ చంద్రావతి ఆదేశించారు. ఈ నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్‌ నేపథ్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా టెంట్లు, తాగునీరు సదుపాయం ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట హెచ్‌డీటీ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’పై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన తాగునీరు, పారిశుద్ధ్యం, పీఎంజేఏవై, మిషన్‌ అంత్యోదయ, ఈ–సర్వీసులు, రైస్‌కార్డులు, పెన్షన్ల పంపిణీ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని, సమస్యల పరిష్కారానికి ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో మండల ఈఓపీఆర్‌డీ రాంబాబు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం


తెర్లాం: కుమ్మరిపేటలో ర్యాలీలో బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది

తెర్లాం: ఆడపిల్లల సంరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పుట్టిన ప్రతీ ఆడపిల్లను బతకనిద్దాం, చదవనిద్దామని తెర్లాం పీహెచ్‌సీ సీహెచ్‌ఓ భాస్కరరావు, ఐసీడీఎస్‌ తెర్లాం సెక్టార్‌ సూపర్‌వైజర్‌ ఉషారాణి అన్నారు. గురువారం మండలంలోని కుమ్మరిపేట కేజీబీవీలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు చేపడుతున్నారని, దిశా చట్టంతో పాటు దిశా పోలీస్‌స్టేషన్‌ ఏర్పాటు చేశారని, అలాగే సఖి కార్యక్రమం నిర్వహిస్తూ వారి ఆరోగ్య భద్రత, రక్షణకు సలహాలు సూచనలు ఇస్తున్నారన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, బాలికలను సంరక్షిద్దాం.. వారిని చదువుకోనిద్దాం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కుమ్మరిపేట, ఎంఆర్‌ అగ్రహారం, కూనాయవలస, తెర్లాం, రంగప్పవలస గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీబీవీ సీఆర్‌టీలు పాల్గొన్నారు.

ఫీవర్‌ సర్వే చేయండి


మాట్లాడుతున్న వైద్యురాలు శ్రుతి

మెంటాడ: ఎప్పటికప్పుడు ఫీవర్‌ సర్వే చేసి, ప్రజలు జ్వరాల బారినపడకుండా చూడాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రుతి సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఆమె ఆస్పత్రి పరిధిలోని 14 గ్రామాల్లో అక్కడక్కడా సీజనల్‌ వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారని, ఈ విషయం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న వైద్య సిబ్బంది దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధుల బారినపడకుండా ఉండాలని కోరారు.

ఘనంగా ఇంటమ్మ సంబరాలు

బాడంగి: పట్టణంలో ఇంటమ్మతల్లి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు ఇంట్లో కొలువైన అమ్మవారికి తొలుత పూజలు చేసి, అనంతరం అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించి, అనుపోత్సవం చేశారు.

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలోని శివ పంచాయతన ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, వేద పారాయణం, ప్రాతఃకాల మండపార్చనలు, సూర్య నమస్కారాలు, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, మహన్యాస పూర్వ రుద్రాభిషేకం, విశేష హోమాలు, పంచశయాధివాసం, దిగ్బలి, వేదస్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు.

గుడ్‌టచ్‌, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్‌ పీఓ విజయకుమారి

బొబ్బిలి: స్థానిక కేజీబీవీలో గురువారం ‘సఖి’ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్‌ ఐసీడీఎస్‌ పీఓ విజయకుమారి బాలికలకు గుడ్‌ టచ్‌, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. వేధింపులుంటే పోలీసులకు తెలియజేసి, రక్షణ పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, రూరల్‌ ఐసీడీఎస్‌ పీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేతనదారులకు పని కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి రూరల్‌: జాబ్‌కార్డు ఉన్న ఉపాధి హామీ వేతనదారులందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఆయన వేతనదారులతో రెండు పూటలా పనిచేయించాలని, నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ జనార్దనరావు, ఈసీ శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆర్‌డీ సమీక్ష


అభివృద్ధి పనులపై ఆరాతీస్తున్న మున్సిపల్‌ ఆర్‌డీ నాగరాజు

రాజాం: స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై మున్సిపల్‌ ఆర్‌డీ(రీజనల్‌ డైరెక్టర్‌) డి.నాగరాజు గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ వార్డులో తప్పనిసరిగా సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం జరగాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, రాజాం మల్లిఖార్జున కాలనీలో నిర్వహిస్తున్న వారపు సంతపై వస్తున్న ఫిర్యాదులపై ఆరాతీశారు. లంపీ స్కిన్‌ వ్యాధి విజృంభణ సమయంలో పశువుల సంత నిర్వహణపై ఆయన మండిపడ్డారు. ఇక్కడి నుంచి పశువులను కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ డీటీవీ కృష్ణారావు, మేనేజర్‌ నాగరాజు, మున్సిపల్‌ ఏఈ రత్నాకర్‌, రాజాం టౌన్‌ ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

జోరుగా పెన్షన్ల పంపిణీ


విజయనగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్‌ అందిస్తున్న వలంటీర్‌ శారద


రేగిడి: విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాములమ్మకు పెన్షన్‌ అందిస్తున్న వలంటీర్‌ గోవిందరావు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పెన్షన్ల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఒకటో తేదీ నాటికే దాదాపు పెన్షన్ల పంపిణీ పూర్తి కాగా, రెండో రోజు అయిన గురువారం అరకొరగా మిగిలిపోయిన పెన్షన్లను పంచిపెట్టారు. అనారోగ్యం రీత్యా దూర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లిమరీ కొంతమంది వలంటీర్లు పెన్షన్లు అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుండడం విశేషం.

–సాక్షి నెట్‌వర్క్‌

చురుగ్గా కాలువ నిర్మాణ పనులు


రాజాం: పెనుబాకలో నిర్మిస్తున్న కాలువను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో మురుగు కాలువ నిర్మాణ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. దాదాపు రూ.1.20 లక్షల వ్యయంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉండిపోయిన ఈ సమస్యను గతంలో గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువెళ్లడంతో పరిష్కారమైందని, అందుకుగాను ఎమ్మెల్యేకు కృతజ్ఞతలని గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం ఎంపీడీఓ బాసూరి శంకరరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు నిర్మాణ పనులను పరిశీలించి, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

గ్యాస్‌ పెంపును నిరసిస్తూ ఆందోళన


రామభద్రపురంలో గ్యాస్‌ సిలిండర్లతో సీపీఎం నాయకుల నిరసన



బొబ్బిలి: ఆకులరెల్లి వీధిలో రోడ్డుపై కట్టెల పొయ్యి వినియోగిస్తూ ఆందోళన చేస్తున్న మహిళలు

రామభద్రపురం: కేంద్రం ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్‌ ధరలను వ్యతిరేకిస్తూ సీపీఎం గురువారం నిరసనకు దిగింది. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకుడు బలస శ్రీనివాసరావు, మరికొంతమంది నేతలు, కార్యకర్తలంతా కలిసి, గ్యాస్‌ సిలిండర్లతో రోడ్డుపై ర్యాలీగా నడుచుకుని వెళ్లి, మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లోని మూడు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్రం గ్యాస్‌ ధరలు పెంచి, తన రాజకీయ దుర్బుద్ధిని చాటుకుందని నేతలు విమర్శించారు. ఒక్కో సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచడం చాలా దారుణమన్నారు. తక్షణమే పెంచిన ధరలు తగ్గించాలని లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్యామల, పరమేశ్వరరావు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: వంటగ్యాస్‌ ధరల పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలోని ఆకులరెల్లి వీధిలో మహిళలు ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ డివిజన్‌ కార్యదర్శి పి.శంకరరావు మాట్లాడుతూ కేంద్రం అనేకసార్లు గ్యాస్‌ ధరలు పెంచి, సామాన్యుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. పెట్టుబడిదారులకు అండగా నిలుస్తున్న మోదీ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.